మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# 28న జాతీయ లోక్ అదాలత్

**ప్రజలకు తక్షణ న్యాయం రాజీ మార్గమే రాజ మార్గం**

**కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎస్పీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.జానకి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, కోర్టుల పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం పొందేందుకు ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునే మంచి అవకాశం ఇదని, శాంతియుతంగా ఇరు పక్షాల అంగీకారంతో సమస్యలు పరిష్కారం అయ్యే విధానం లోక్ అదాలత్ అని తెలిపారు. కోర్టుల్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ తెలిపారు.


జిల్లా ఎస్పీ డి.జానకి


పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## తూడుకుర్తి పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**ఆసుపత్రుల్లో అన్ని మందులు అందుబాటులో ఉండాలి**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని తుడుకుర్తి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిసెప్షన్ సెంటర్, ఇన్‌పేషెంట్ విభాగం, జనరల్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని, అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంతమంది రోగులు వస్తున్నారు, స్థానికంగానే ప్రసవాలు జరుగుతున్నాయా అనే విషయాలపై సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై సమీక్ష చేసి, అవసరమైన సూచనలు ఇచ్చారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని – మిగతా4లో..


సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హరిప్రియ

## దివ్యాంగుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**ఇండ్లకు కేటాయింపుల్లో 5% రిజర్వేషన్ కల్పించాలి**

**రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్ బి. హరిప్రియ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త:** జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘాల కమిటీ సభ్యులు, జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు, ఫిర్యాదులను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దివ్యాంగులకు అందించే సేవలు సరిగా అందించాలని. యుడిఐడి కార్డులలో పేర్ల తప్పులను సవరించి వారికి అందే పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను అందించాలని అన్నారు. దివ్యాంగులకు డబుల్ బెడ్ రూముల కేటాయింపుల్లో 5 శాతం రిజర్వేషన్ ను పాటించాలని, అలాగే జిల్లా – మిగతా4లో..

తెలంగాణ ఉద్యమం తర్వాతనే

# సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం

**జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు క్రాఫ్ హాలిడే**

**పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు**

**ఆయకట్టుకు సాగునీటితో జలకళ**

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి, మార్చి 24 ప్రభాతవార్త :** కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్ ను మంగళవారం రైతులతో కలిసి సందర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కల్వకుర్తి పరిధిలో పంటలకు మరో నలభై ఐదు రోజులు నీళ్ల ఇవ్వాల్సి ఉంటుందని శ్రీశైలం నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు సమానంగా నీళ్ళు ఇవ్వాలని కోరారు కల్వకుర్తి మోటర్ లతో 240 రోజుల పాటు నీటిని పంపింగ్ చేయొచ్చని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను అదే లెవెల్ లో చేపట్టినం శ్రీశైలం లో బురద వచ్చే వరకు నీటిని తోడే అవకాశం ఉంటుందని తెలిపారు. డెడ్ స్టోరేజ్ వరకు నీటిని పంపింగ్ చేయవచ్చని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ జూరాల వద్ద చేపడితే నీటిని పంపింగ్ చేయాలిమన్నారు. శ్రీశైలం నుండి నలభై ఐదు రోజుల్లో తొంబై టీ ఏం సి లు ఎత్తి పోయవచ్చని నీళ్ళు లేని చోట పాలమూరు సోర్స్ పెట్టమని అంటారు. నీళ్ళు వున్న శ్రీశైలం ను ఆంధ్రాకు ధార దత్తం చేయడానికి అలా మాట్లాడుతారన్నారు కల్వకుర్తి పంపింగ్ ఇవాల్టి కి కొనసాగుతుందని సందర్భంగా గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నుండి కూడా మార్చి ఆఖరు వరకు పంపింగ్ చేయొచ్చని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను పడావు పెట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడం లక్ష్యంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీకారం. అసంపూర్తిగా ఉన్న కెఎల్ఐ ప్రాజెక్ట్ పథకానికి 3వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఎలక్ట్రో మెకానికల్ వర్క్స్ టన్నులు, కాల్వలు, పవర్ లైన్స్, సర్జ్‌పుల్, పంపు హౌజులు, మోటార్స్ పూర్తి చేసి 4లక్షల ఎకరాలకు సాగు నీళ్ల, కాల్వల ద్వారా, భూగర్భ జలాలు ద్వారా మరో లక్ష ఎకరాలకు మొత్తం 5లక్షల ఎకరాలకు సాగు నీళ్ల అందించారని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మిగిలిన 35 లక్షల ఎకరాల కు సాగు నీళ్ల అందించి రైతులను రాజులను చేయాలన్న సంకల్పంతో కె.సి.ఆర్ గారు నీటి లభ్యత ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు దగ్గర పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని నిరంజన్ రెడ్డి అన్నారు. 90శాతం పూర్తి అయిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తట్టెడు మట్టి తీయకుండా పడావు పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని విమర్శించారు. 27వేల ఎకరాల భూసేకరణ జరిపి 32 వేలకోట్ల ఖర్చు చేసి 27వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లించి నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. కేవలం 1000 కోట్లు ఖర్చు చేసి 10 శాతం పనులు పూర్తి చేయకుండా కాంగ్రెస్ నిరక్ష్యం చేస్తుందని విమర్శించారు. పాలమూరు బిడ్డగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పడావు పట్టడమే కాకుండా రేవంత్ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. నీటి లభ్యత లేని జూరాల దగ్గర పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేయాలని చెప్పడం రైతులను మోసం చేయడం కోసమేనని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, భీమయ్య, సురేందర్ రెడ్డి, శివరామ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, వనం రాములు, పృథ్వీ రాజ్, బి.బాలరాజు, వేణు యాదవ్, తిరుపతయ్య, మాణిక్యం, ధర్మా నాయక్, మురళీ సాగర్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సూర్యవంశం గిరి, ఇమ్రాన్, హేమంత్ ముదిరాజ్, స్వాతి హరిబాబు, బాబు నాయక్, తదితరులు ఉన్నారు.


కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**గద్వాల మార్చి 24, ప్రభాతవార్త :** గద్వాల చేనేత జరీ చీరలు ఎంతో ప్రఖ్యాతి చెందాయని, ఇక్కడి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం గట్టు మండలం ఆరగిద్ద గ్రామంలో పలువురు చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి కలెక్టర్ మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరగిద్ద చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో నేసిన చేనేత చీరలను నేరుగా మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. సంస్థ కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.98 లక్షల రుణాలు ఇవ్వాలని గతంలోనే డిసిసిబి బ్యాంకులో అడగగా రాలేదని సంఘం అధ్యక్షుడు నర్సప్ప కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఎల్డీఎం శ్రీనివాసరావుతో మాట్లాడి బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. చేనేత చీరల తయారీకి కావాల్సిన ముడి సరకు, యంత్రాలు, డిజైనింగ్, తదితర విషయాల గురించి చేనేత కార్మికులు కలెక్టర్ కు వివరించారు. ఒక చీర తయారు చేయడానికి పట్టే సమయం, చీరల డిజైన్ బట్టి ధరలు, నాణ్యత గురించి కార్మికులు సమగ్రంగా కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ను చేనేత కార్మికులు సన్మానించారు. అనంతరం ఆరిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఒక ఏరియాలో ఇళ్లమీదుగా ఉన్న హై టెన్షన్ విద్యుత్ తీగల సమస్యను గ్రామస్తులు కలెక్టర్ కు తెలియజేశారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న వాష్రూమ్స్ ను కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు. అలాగే గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగారు. నిర్మాణంలో ఉన్న ఒక ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు ప్రభుత్వము అందించే రూ.5 లక్షలతో పాటు, తాము జమ చేసుకున్న డబ్బుతో ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో గట్టు మండల ఎంపీడీవో చెన్నయ్య, చేనేత జౌళి శాఖ డివో సుధారాణి, గ్రామ సర్పంచ్ బాలకృష్ణ, తదితరులున్నారు.


చేనేత చీరను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల శిక్ష

**రూ.30 వేల జరిమానా విధించిన కోర్టు**

**న్యాయం సాధించిన బాధితురాలు**

**కోర్టు కఠిన తీర్పు నేరస్తులకు గట్టి హెచ్చరిక**

**పోలీసుల సమర్థ దర్యాప్తుతో న్యాయం సాధ్యం**

**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**వనపర్తి, మార్చి 24 ప్రభాతవార్త :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో, వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30,000 జరిమానా విధిస్తూ ఈ రోజు (24.03.2026) కఠిన తీర్పునిచ్చారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు. కేసు వివరాలు వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం లక్ష్మి తాండాకు చెందిన ఒక మైనర్ బాలిక (9వ తరగతి) ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సమయంలో, అదే తండాకు చెందిన నిందితుడు ఆమెను బలవంతంగా గ్రామం బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతుకుతూ వెళ్లగా, గుట్ట దగ్గర ఏడుస్తూ ఉన్న బాలికను కనుగొన్నారు. జరిగిన ఘటనను బాలిక తన తల్లికి వివరించగా, తల్లి వెంటనే 27.02.2020న గోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే కేసు నమోదు చేసిన గోపాల్‌పేట్ ఎస్సై, రామన్ గౌడ్, అప్పటి సీఐ, సూర్య నాయక్ ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు సాంకేతిక ఆధారాలు, బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జ్ షీట్ దాఖలు – మిగతా4లో..


జిల్లా ఎస్పీ సునీత రెడ్డి (ఫైల్)


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి**

**వనపర్తి, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా వైద్య అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మిషన్ మధుమేహ దృష్టి కార్యక్రమం పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అధికారులు ఇప్పటివరకు 12,000 మందికి పైగా ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఏప్రిల్ నెలాఖరులోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల ద్వారా కంటి, దంత సమస్యలు ఉన్న పిల్లలకు తగిన చికిత్స అందించాలని సూచించారు. జిల్లాలో ప్రతి గర్భిణి మహిళను తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల మెరుగుదలకు అవసరమైన సదుపాయాల కోసం సహకారం అందిస్తామని వైద్యులు మరింత కృషి చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిఎంహెచ్ఓ సాయినాథ్‌రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.


జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం జరగాలి

**పెండింగ్ లో 156 కేసులు**

**జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ**

**సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**పాల్గొన్న ఎస్పీ జానకి, జిల్లా అధికారులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24 ప్రభాతవార్త:** జిల్లాలోని ఎస్‌సి., ఎస్‌టి అట్రాసిటీ కేసులలో బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టర్ – మిగతా4లో..

# ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు సత్వర చర్యలు

**కిషోర బాలికలకు భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్**

**ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి రూపాయల నిధులతో కొత్తగా ఏర్పాటు చేయనున్న సి.టిస్కాన్**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎంఐడిసి ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ లతో కలిసి కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక కోటి రూపాయల నిధులతో కొత్తగా ఏర్పాటు చేయనున్న సి.టి.స్కాన్ సెంటరు, సదరం క్యాంపు కేంద్రాలలో జరుగుచున్న పనుల పురోగతిని పరిశీలించారు. వీటితో పాటు ఆసుపత్రికి అవసరమైన వీల్ చైర్లు, బిపి కొలిచే మిషన్లు ఇతర మోలిక సదుపాయాలు సమకూర్చుకోడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభోత్సవం చేసుకునే విధంగా సిటి స్కాన్, సదరం క్యాంపు గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేసి అందులో సమకూర్చాల్సిన యంత్ర సామాగ్రికి వెంటనే ఆర్డరు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాత క్షయ వ్యాధి వార్డు గదులను తొలగించండి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంతకు ముందు ఉన్న పాత క్షయ వ్యాధి భవనం పూర్తిగా శిలావస్థకు చేరుకున్నందున రోడ్లు భవనాల ఇంజనీరు ఆమోదంతో భవనాన్ని తొలగించాలని సూచించారు. వర్షాకాలంలో తడిచి కూలిపోయే ప్రమాదం ఉన్నందున అంతకంటే ముందే శిథిలాలను తొలగించాలని సహాయ ఇంజనీరును ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటి వరకు ఎంత మంది కిశోర బాలికలకు వ్యాక్సిన్ ఇచ్చారు, బాలికల వెంట తల్లిదండ్రులు వస్తున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సరు వ్యాధి ఎప్పటికీ రాకుండా ఉండటానికి ప్రస్తుతం 1415 సంవత్సరాల కిషోర బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. అమ్మాయిలు కేవలం ఒకసారి మాత్రమే ఈ వ్యాక్సిన్ తీసుకుంటే జీవితంలో ఎప్పుడూ క్యాన్సర్ దరిచేరదు. ఇంతటి మహత్తరమైన ఈ వ్యాక్సిన్ పట్ల తల్లిదండ్రులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించి ప్రతి కిషోర బాలికకు సురక్షితమైన హెచ్‌పివి వ్యాక్సిన్ ఇప్పించి సర్వైకల్ క్యాన్సర్ నుండి కాపాడుకునే విధంగా చూడాలని వైద్య సిబ్బందిని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో తనకు సిబిపి. , హెచ్.బి.1 రక్త పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా సాయినాథ్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అరుణ కుమారి, డా. పరిమళ, ఇతర వైద్య సిబ్బంది, తెలంగాణ యం.ఐ.డి.సి సహాయ ఇంజనీరు శివ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.


రక్త పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## నేడు మండల కేంద్రంలో మెగా మెడికల్ క్యాంప్

**నవాబుపేట, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నవాబుపేట ఆవరణలో నేడు బుధవారం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని పీహెచ్‌సి నవాబుపేట మెడికల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ మెడికల్ వైద్య శిబిరానికి ప్రత్యేక డాక్టర్లు డా. దివ్య ప్రసూతి మరియు స్త్రీ రోగ విభాగం,డా. నూర్ చిన్న పిల్లల విభాగం,డా. అఖిల ఎముకల విభాగం, డా. భరత్ జనరల్ విభాగం,డా.డి.శ్వేత కంటి వైద్యులు, డా. ప్రణవి దంత వైద్యులు, ప్రత్యేక వైద్యులు వైద్య శిబిరానికి నిష్ణాతులైన డాక్టర్లచే వైద్య సేవలు ఉంటాయని, క్షయరోగ నిర్ధారణ పరీక్షలు ఎక్స్రే రక్తపరీక్షలు జరిపి రోగులకు ఉచిత మందులు అందజేయబడతాయని తెలిపారు. మండల ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వైద్య మెగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ అవకాశాన్ని నవాబుపేట మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పేషెంట్ వచ్చేటప్పుడు తప్పకుండా తమ యొక్క ఆధార్ కార్డును ఫోన్ నెంబరు తీసుకొని రావాల్సి ఉంటుందని తెలిపారు.

## పాలమూరు యూనివర్సిటీ
## ఖోఖో జట్టుకు కోచ్‌గా చెన్నారం వెంకటప్ప



**మద్దూర్, మార్చి 24 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీకి చెందిన ఖోఖో జట్టు ఆల్ ఇండియా సౌత్ జోన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని దావనగిరి నగరానికి బయలుదేరింది. ఈ ప్రతిష్టాత్మక పోటీలు ఈ నెల 26 నుండి 29 వరకు జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు కోచ్‌గా చెన్నారం వెంకటప్ప నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. క్రీడల పట్ల ఆయనకున్న నిబద్ధత, శిక్షణా నైపుణ్యం కారణంగా ఈ బాధ్యతలు ఆయనకు అప్పగించినట్లు సమాచారం. చెన్నారం వెంకటప్ప కోచ్‌గా ఎంపిక కావడం పట్ల స్థానిక విద్యా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. మండల విద్యాధికారులు బాలకిష్టప్ప, ఆంజనేయులు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవితతో పాటు ఉపాధ్యాయ బృందం ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జట్టు సభ్యులు సమష్టిగా కృషి చేసి ఉత్తమ ప్రదర్శన కనబరిచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షి ంచారు. ఈ పోటీల్లో పాలమూరు యూనివర్సిటీ జట్టు ప్రతిభను చాటుతూ మంచి ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజలకు కంకర కష్టాలు తప్పవా..



పలు ఇబ్బందులకు గురి అవుతున్నా ప్రయాణికులు

**మల్దకల్ మార్చి 24, ప్రభాతవార్త:** మల్దకల్ మండలంలోని ఎల్కూరు గ్రామం ఒక సమయంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించింది. కానీ నేడు ఆ గ్రామానికి వెళ్లాలంటేనే రోడ్డు గుంతల మాయమై ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. గతంలో గట్టు ఎత్తిపోతల పథకానికి ఈ గ్రామంలోని నల్ల మట్టిని తీసుకు వెళుతూ రోడ్డును టిప్పర్లు అధ్వాన్నంగా తయారు చేశాయి. నాటి నుండి నేటి వరకు రోడ్డును పట్టించుకునే వారు లేరు. దీంతో ఆ గ్రామస్తులు పాలవాయి ద్వారా గద్వాలకు వెళుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప మల్దకల్‌కు రోడ్డు ద్వారా రావడం జరుగుతుందని తెలిపారు. రోడ్లు పంచాయితీరాజ్ శాఖ పరిధిలో ఉన్నందున ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కంకర పరిచారు బీటీ వేయడం మరిచారు.రాత్రి వేళ వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురికాక తప్పదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటి వేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు.

## పేరూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**డా.రాధిక, ఎంబీబీఎస్ వైద్య అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరుర్**



వైద్యాధికారి డా. రాధిక

**దేవరకద్ర, మార్చి 24 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల్లో భాగంగా కౌకుంట్ల మండలం, పేరూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ప్రత్యేక నిపుణ వైద్యులచే ఏర్పాటు చేయనున్నారని వైద్యాధికారి డా. రాధిక అన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరుర్ లో 26వ తేదీన గురువారం రోజు ప్రత్యేక వైద్య నిపుణులైన గైనకాలజిస్ట్, కంటి నిపుణులు, చిన్నపిల్లల వైద్యులు, దంత వైద్యులు, ఎముకల ఆర్థోపెడిక్, పిజిషియన్, క్షయ నియంత్రణలో భాగంగా ఇక్కడే ఉచిత ఎక్స్‌రే ద్వారా క్షయ పరీక్ష చేయబడును. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని, రోగులను పరిశీలించి, అవసరమైన మందులను ఉచితంగా అందించనున్నారు. వివిధ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నారు.ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో వివిధ గ్రామ ప్రజలు పాల్గొని, సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇలాంటి శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని డా. రాధిక తెలిపారు.

## విద్యార్థులకు సేవింగ్స్, బ్యాంకింగ్‌పై అవగాహన




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నారాయణ పేట, మార్చి 24 ప్రభాతవార్త :** నారాయణపేట మండలంలోని కోటకొండ గ్రామంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలల ఆర్‌బీఐ వీడియోస్ ఎన్‌జీఓ కౌన్సిలర్లు అనసూయ ఆధ్వర్యంలో జాతీయ ఆర్థిక విద్యా కేంద్రం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సేవింగ్స్ ప్రాధాన్యతపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే బ్యాంకు అకౌంట్లు, బ్యాంకింగ్ వ్యవస్థ పని విధానం గురించి సులభంగా అర్థమయ్యేలా వివరించారు. సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పిస్తూ,ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆదా చేసే అలవాటు పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడటానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. డిజిటల్ లావాదేవీలలో మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఆచార్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా నిలిచింది.

## తేరు ఉత్సాహాలను విజయవంతం చేయాలి

**సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు**



**ఉప్పునుంతల, మార్చి 24 ప్రభాతవార్త :**మండల కేంద్రమైన ఉప్పునుంతలలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని తేరు ఉత్సాహ కమిటీ ఆధ్వర్యంలో జరుపుకునే ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు కోరారు. నియోజక వర్గంలోనే ఉప్పునుంతలలో కనివిని ఎరుగని రీతిలో ఉత్సాహాలు జరుగుతున్నందున అత్యధికంగా భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 27 నుంచి 29 వరకు జరుగు బ్రహ్మోత్సవాల్లో తేరు కార్యక్రమం తదుపరి పలు సాంస్కృతిక, వివిధ రంగాలలో పోటీలు, బండలాగుడు పోటీలు, కోలాటం పోటీలు నిర్వహిస్తున్నాడం తో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు కోరారు.

## క్షయ వ్యాధి నిర్మూలన ప్రభుత్వ ధ్యేయం



ర్యాలీని నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

**ఎర్రవల్లి మార్చి 24, ప్రభాతవార్త:** ఇటిక్యాల మండల కేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ఇటిక్యాల వైద్యురాలు డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ఇటిక్యాల గ్రామంలో ర్యాలీని నిర్వహించి మన పంతం టీబి అంతం అనే నినాదంతో ఇటిక్యాల బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రతిజ్ఞ చేయించడంజరిగింది2030 సంవత్సరం నాటికి మనదేశంలో ఎక్కడ కూడా క్షయ వ్యాధిగ్రస్తులు ఉండకూ దదని మన ప్రభుత్వ ధ్యేయమ్. క్షయ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, లక్షణాలు చికిత్స గురించి వైద్యురాలు డాక్టర్ రాధిక వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# వనపర్తి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,మార్చి 24 ప్రభాతవార్త :** క్షయవ్యాధికి మందులు ఉన్నాయని, ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధి పూర్తిగా నయమైపోతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక టిబి నివారణ కేంద్రంలో కలెక్టర్ వంద రోజుల క్యాంపెయిన్ వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు.ఈ వంద రోజుల కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామ గ్రామాలకు తిరుగుతూ టిబి లక్షణాలు ఉన్న వ్యక్తులకు ఉచితంగా మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్షలు నిర్వహించి టిబి ఉన్న రోగులకు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుంది. క్షయ వ్యాధి రోగులను గుర్తించే కార్యక్రమం ఇప్పటికే జిల్లాలో నిర్వహించి క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు ఉచితంగా మందులు పౌష్టికాహారం వెయ్యి రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగ కలెక్టర్ చేతుల మీదుగా క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో గోధుమ పిండి, మంచి నూనె, బెల్లం, వేరుశనగ, పప్పు దినుసులు వంటి ఆహార పదార్థాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టిబి అనేది ఒక అంటూ వ్యాధి అని దీనిని ఆదిలోనే గుర్తించి ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇచ్చే మందులను (6) నెలలపాటు క్రమం తప్పకుండా వాడితే జీవితంలో మరెప్పుడూ టీబి రాకుండా నయం అయిపోతుందన్నారు. ఒక నెల, రెండు నెలలు వాడి ఇక నయం అయిపోతుందని మందులు వేసుకోవడం మానేస్తే కొద్ది రోజులకే తిరిగి వ్యాధి వస్తుందని చెప్పారు. అందుకే వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండి ఆరు నెలలు మందులు వాడి పౌష్టికాహారం తీసుకోవడంవల్ల క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ రమేష్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐరాడ్ అప్లికేషన్‌తో ప్రమాదాలపై కట్టుదిట్టమైన చర్యలు

**ప్రమాద బాధితులకు ఉచిత చికిత్స, ఇన్సూరెన్స్ బీమాపై అవగాహన**

**ప్రతి ప్రమాదం వెనుక కారణాలను గుర్తించి నివారణ**

**ఎస్సైలు, రైటర్లకు ఐరాడ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం : జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



ఐరాడ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమానికి హాజరైన పోలీస్ సిబ్బంది

**వనపర్తి, మార్చి 24 ప్రభాతవార్త :** జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ భవనంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, జిల్లాలోని ఎస్సైలకు, రైటర్లకు ఐరాడ్ (ఇంటిగ్రేటెడ్ రోడ్ ఆక్సిడెంట్ డేటాబేస్) అప్లికేషన్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐరాడ్ అప్లికేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడం, ప్రమాద స్థలాలను ఖచ్చితంగా గుర్తించడం, డేటా విశ్లేషణ ద్వారా ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టే విధానాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రమాదాలపై సమగ్ర సమాచారం సేకరణ ద్వారా బ్లాక్‌స్పాట్స్ గుర్తించి, రోడ్డు భద్రతను పెంపొందించడంతో పాటు రోడ్డు ప్రమాదంలో బాధితులకు ఒకలక్ష, ఐదువేల ఉచిత ఐరాడ్ యాప్ ముఖ్య పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోడ్డు ప్రమాదం వెనుక ఉన్న కారణాలను సాంకేతికత ద్వారా గుర్తించడం అత్యంత అవసరం ఐరాడ్ అప్లికేషన్‌ను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ప్రమాదాల నివారణకు సరైన ప్రణాళికలు రూపొందించవచ్చు. రోడ్డు ప్రమాదాలపై ఖచ్చితమైన సమాచారం సేకరణలో ఐరాడ్ అప్లికేషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రతి ప్రమాదాన్ని సమగ్రంగా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రమాదాలు తగ్గించే చర్యలు తీసుకోవడం సులభమవుతుందని ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం అందించే ఇన్సూరెన్స్ బీమా ప్రయోజనాలు, ఉచిత చికిత్స అవకాశాలు గురించి పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బంది ప్రతి ఘటనను ఖచ్చితంగా నమోదు చేస్తే, రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, జిల్లాలోని ఎస్సైలు, పోలీస్టేషన్ల సిసిటి ఎన్ఎస్ రైటర్లు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేసే వరకు వదిలిపెట్టం



బిఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన దృశ్యం

**ఆత్మకూర్ మార్చి 24, ప్రభాతవార్త:** గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్ బీఆర్ఎస్ వి మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు రియాజ్ అలీ తదితరులు అన్నారు. మంగళవారం రోజు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కోసం ఇచ్చిన పిలుపుమేరకు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడమే కాకుండా ప్రశ్నించే గొంతుకలను అక్రమంగా అరెస్టు చేస్తూ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్నారని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు వాగ్దానాలను అమలు చేయాలని లేని పక్షంలో అడుగడుగునా కాంగ్రెస్ నాయకులను వెంబడిస్తూ ఉంటామని వారు హెచ్చరించారు. ప్రభుత్వంలో కీలుబొమ్మలుగా మారిన పోలీసులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు కొనసాగించేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడం పోలీసుల నిరంకుశత్వానికి నిదర్శనమని వారు అన్నారు. అరెస్టు అయిన వారిలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్తబోయే శేఖర్, రాజ్ కిరణ్, అనిల్ కుమార్, మాజీ కౌన్సిలర్ మండల రామకృష్ణ, లక్ష్మీకాంత్ రెడ్డి, జానకి రాములు, తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మెగా రెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

**శ్రీరంగాపూర్, మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని నగరాల గ్రామానికి చెందిన గుంటి రాజు తండ్రి గుంటి భీముడుకు గుండె ఆపరేషన్ జరిగింది.ఈ విషయాన్ని శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి నగరాల గ్రామ సర్పంచ్ గుంటి మహదేవ్ సాగర్ వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని నాలుగు లక్షల అరవై వేల రూపాయల (4,60,000/) సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేయడం జరిగింది. ఈ చెక్కును మంగళవారం హైదరాబాద్లోని తన ఆఫీస్ నందు ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి బాధితునికి అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నటువంటి పథకాలలో సీఎం రిలీఫ్ ఫండ్ ఒకటి అని ఇది పేదల ఆరోగ్య జీవితాలలో వెలుగులు నింపే పథకం అని ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలియజేశారు. చెక్కును అందుకున్న గుంటి రాజు శ్రీరంగాపూర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. శ్రీరంగాపూర్ మండల ఇంచార్జ్ రెడ్డి చర్ల శ్రీహరి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, నగరాల గ్రామ సర్పంచ్ గుంటి మహదేవ్ సాగర్, వార్డు మెంబర్ నరేష్ శెట్టి, గుంటి గోపాల్, షేర్ పల్లి చీర్ల నాగరాజు సాగర్ తదితరులు ఉన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షల్లో 26 సీట్లు సాధించిన విద్యార్థులు

**ఉప్పునుంతల, మార్చి 24 ప్రభాతవార్త :** 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తూ అధిక సంఖ్యలో గురుకుల సీట్లు సాధించడం గర్వకారణంగా నిలిచిందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో, ఉపాధ్యాయుల మార్గ దర్శకత్వంలో శ్రమించి మంచి ఫలితాలు సాధించారని ఎంఇఓ అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ విజయంతో తమ ప్రతిభను చాటుకున్నారని అన్నారు.పాఠశాలవారీగా సీట్లు సాధించిన వివరాలు ఇలా ఉన్నాయి: పి.ఎస్ ఈరట్వానిపల్లి 8 మంది,యు.పి.ఎస్ తాడూర్ 6 గురు, పి.ఎస్ తిరుమలపూర్ లో 5 మంది,పి.ఎస్ కంసానిపల్లి ఇద్దరు,పి.ఎస్ ఉప్పరిపల్లి ఇద్దరు,యు.పి.ఎస్ గువ్వలోనిపల్లి ఒక్కరు,పి.ఎస్ పెనిమెల్ల లో ఒక్కరు,పి.ఎస్ దాసర్లపల్లి పాఠశాలలో ఒక్కరుమొత్తం 26 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందడం సాధించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు 26 మంది గురుకుల పాఠశాల సీట్లు సాధించడం అభినందనీయమని, విజయం సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను మండల విద్యాధికారి అభినందించారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులు అధిరోహించాలని మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి




అవగాహన కల్పిస్తున్న షీటీమ్ పోలీసులు

**నారాయణ పేట, మార్చి 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని దయానంద విద్యా మందిర్ పాఠశాలలో షీ టీమ్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు,చెన్నప్ప మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు తమ భద్రతపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలకు,కళాశాలకు వచ్చి వెళ్లే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వెంటనే సమీప పోలీసులకు లేదా షీ టీమ్ నంబర్ 8712670398 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సైబర్ నేరాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ,మోసాలకు గురైనట్లయితే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచారాన్ని అనవసరంగా పంచుకోవద్దని హెచ్చరించారు. ఈవ్ టీజింగ్, వేధింపులు, బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూస్ వంటి అంశాలపై చట్టపరమైన చర్యలను వివరించి,ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తమ హక్కులు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించబడింది. కార్యక్రమంలో షీ టీమ్ పోలీసులు జ్యోతి, కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

**ఉప్పునుంతలలో అవగాహన ర్యాలీ**



ఉప్పునుంతలలో అవగాహన ర్యాలీ

**ఉప్పునుంతల,మార్చి 24 ప్రభాతవార్త :** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి ణి డాక్టర్ స్వప్న పిలుపునిచ్చారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య అధికారిణి డా. స్వప్న, డా. బిక్కు లాల్, ఫార్మసిస్ట్ కుమార చారి, హెల్త్ సూపర్ వైజర్ ప్రభావతి, ఎంహెచ్‌పిఎస్, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు చీరల పంపిణీ



చీరల పంపిణీ చేస్తున్న వైద్య అధికారిణి డా. స్వప్న

**ఉప్పునుంతల, మార్చి 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర వైద్యశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా అందించిన చీరలను మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా కార్యకర్తల కు చీరలు స్థానిక వైద్యాధికారిణి డా. స్వప్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి డా.స్వప్న, డా. బిక్కు లాల్, ఫార్మసిస్ట్ కుమార చారి, హెల్త్ సూపర్ వైజర్ ప్రభావతి, ఎఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప తహసీల్దార్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు



తహసీల్దార్ అద్దంకి సునీత ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**ఉప్పునుంతల, మార్చి 24 ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయానికి ఉప తహసీల్దార్ గా రమేష్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉప తహసీల్దార్ వి.రమేష్ నాయక్ ను తహసీల్దార్ అద్దంకి సునీత ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది,జిపిఓ లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అద్దంకి సునీత, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, శివ, రాజు కుమార్ ,జిపిఓ లు ఆంజనేయులు, సతీష్, రమేష్, వెంకటేష్,శంకర్,రాము, రెవెన్యూ సిబ్బంది. అదే విధంగా రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాపి శెట్టి కుమారస్వామి, సత్యనారాయణ, శంకర్ నాయక్ లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## గాలికుంటు వ్యాధి నివారణకు కృషి

**పశువుల టీకాల పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల మార్చి 24,ప్రభాతవార్త :** పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను పాడి రైతులు తమ పశువులకు వేయించి, వ్యాధి నివారణకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో, భవిష్య భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో మంగళవారం గట్టు మండలం లింగాపురం గ్రామంలో ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల మెగా క్యాంపును నిర్వహించగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువులకు టీకాల పంపిణీ పై అధికారులు ముందుగానే గ్రామాల వారిగా టామ్ టామ్ చేయించాలని సూచించారు. గ్రామస్తులు కలిసికట్టుగా ఉంటే ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేస్తారన్నారు. గ్రామంలో తాగునీటి, డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. భవిష్య భారత్ వంటి స్వచ్ఛంద సేవ సంస్థలు గ్రామాభివృద్ధికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ సమక్షంలో పశువైద్యాధికారులు పశువులకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, ఎంపీడీవో చెన్నయ్య, సర్పంచ్ శకుంతలమ్మ, పశు వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహన

**వెల్దండ, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రపంచ నీటి దినోత్సవం నాగర్ కర్నూల్ జిల్లా భూగర్భ జల శాఖ ఎన్జీవో వారి సహకారంతో మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం భూగర్భ జలాల సంరక్షణ, యాజమాన్యం నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూగర్భ జల శాఖ అధికారి డి.దివ్య జ్యోతి పాల్గొని నీటి ప్రాముఖ్యత, వర్షపు నీటి సేకరణ , నీటి సంరక్షణ




సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమర్థవంతమైన యాజమాన్య పద్ధతులపై రైతులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జియాలజిస్ట్ లింగస్వామి జియోఫిజిసిస్ట్ నవిత మాట్లాడుతూ వెల్దండ మండలంలోని భూగర్భ జలాల ప్రస్తుత స్థితి, జల వనరుల లభ్యత, వినియోగం, మిగులులోటు పరిస్థితులపై వివరించారు. అదనంగా నీటి పొదుపు, సంరక్షణతో పాటు ఆధునిక రీఛార్జ్ పద్ధతులపై కూడా వివరమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్, మంజుల, కిష్టాల్ శేఖర్, రవీందర్ రెడ్డి, శోభారాణి, వ్యవసాయ శాఖ, మాల్యా నీటి పారుదల శాఖ, హార్టికల్చర్ శాఖ అధికారులు, రైతులు, మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

**ఎరవల్లి మార్చి 24, ప్రభాతవార్త :** ఎర్రవల్లి మండల కేంద్రంలోని టెన్త్ బెటాలియన్‌లో మంగళవారము ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగినది ముఖ్యఅతిథిగా బెటాలియన్ కమాండెంట్ ఎం జయరాజు హాజరవ్వగా వైద్య బృందం పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు ఈ హెల్త్ క్యాంప్ జనని హాస్పిటల్ డాక్టర్ చంద్రారెడ్డి (చిన్న పిల్లల వైద్య నిపుణులు), డాక్టర్ ప్రియాంక( స్త్రీ వ్యాధి నిపుణులు) మరియు డాక్టర్ సాయి శ్రీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడినది. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ముఖ్యంగా మహిళలు చిన్నపిల్లలు ఆరోగ్య సమస్యలపై వైద్య సలహాలు తీసుకొని ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో 60 మందికి పైగా వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఆర్.పి.సింగ్, నరసింహరాజు, రాజేశం, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.




హెల్త్ క్యాంపులో మాట్లాడుతున్న కమాండెంట్

## ఇంటి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

**మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్**

**నాగర్‌కర్నూల్, మార్చి 24 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రతి ఒక్కరూ ఇంటిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఇంటిపన్ను చెల్లించని వారు చెల్లించాలన్నారు. నాగర్ కర్నూల్‌పరిధిలో మొత్తం 11వేల నివాసగృహాలు ఉన్నాయని, ఇప్పటివరకు 57 ఇంటిపన్ను వసూలు చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం రూ.7కోట్లకుగాను రూ.4కోట్ల ఇంటిపన్ను బకాయిలు వసూలు చేయడం జరిగిందని ఇంకా మూడు కోట్ల రూపాయలు ఇంటి పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. గతంలో 66 ఇంటి పన్నులు కావడం జరిగిందని గతంలో మాదిరిగానే ఈసారి కూడా అంతకుమించిన టార్గెట్ రీచ్ అయ్యేలా ప్రజలు ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని 24 వార్డుల్లో ప్రజలకు చెత్త బండి, డ్రైనేజీ తో పాటు ఏ సమస్యలు ఉన్న ఎల్లప్పుడూ తమకు అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తామని తెలిపారు. మార్చి 31 లోగా ఇంటి పన్ను బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, కమిషనర్ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్

## బిఆర్ఎస్వి నాయకుల అరెస్టు

**అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న**

**వారిని జడ్చర్లలో ముందస్తుగా అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**జడ్చర్ల మార్చి 24 ప్రభాతవార్త:** బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో జడ్చర్ల బిఆర్ఎస్వి నాయకులను సురేష్, బాలు ముదిరాజ్, సోహైల్, శ్రీకాంత్, రవికాంత్ లను పోలీసులు తెల్లవారుజామున వారిని అదుపులోకి తీసుకొని జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు కేటాయిస్తామని చెప్పిన 15 విద్యాకు నిధులు, 2 లక్షల ఉద్యోగాలు, విద్యా భరోసా కార్డు, అలాగే నిరుద్యోగ భృతి స్కాలర్షిప్ ల విడుదల వంటి చదువుకుంటున్న విద్యార్థినిలకు స్కూటీలు వంటి పలు హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ హామీల అమలు కోసం శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి చేపట్టాలని నిర్ణయించుకున్న విద్యార్థి నాయకులను ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పోలీసులను ఉపయోగించి విద్యార్థి ఉద్యమాలను అణచివేయాలని రేవంత్ సర్కార్ కుట్ర పన్నుతోందని వారు మండిపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్వి ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు.



అరెస్టయిన బిఆర్ఎస్వి నాయకులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**దేవరకద్ర, మార్చి 24 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం జినుగురాళ్ల గ్రామానికి చెందిన బోయ లక్ష్మి మ్మ అనారోగ్యంతో సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జినుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. బోయ లక్ష్మి మ్మ భౌతిక దేహానికి పులమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరహరి ,జనార్దన్ గౌడ్, యాదగిరిరెడ్డి, దాసు, బోయ కురుమూర్తి, నరేష్, బోయ శివ, బోయ కొండన్న, బోయ చిన్న సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు వేగ నియంత్రణ, ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**గద్వాల మార్చి 24, ప్రభాతవార్త :** ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రైవర్లు వేగ నియంత్రణతో పాటు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. పవన్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గద్వాల్ బస్ డిపో నందు డ్రైవర్లకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రైవర్ల చేతుల్లో కేవలం వాహనం స్టీరింగ్ మాత్రమే కాకుండా వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలు మరియు వారి కుటుంబాల నమ్మకం కూడా ఉందని గుర్తుచేశారు. సురక్షిత ప్రయాణం అందరి బాధ్యతగా భావించి ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. అతి వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొంటూ, నిర్ణీత వేగ పరిమితిని ఎట్టి పరిస్థితుల్లోనూ మించకూడదనితెలిపారు. ముఖ్యంగా మలుపులు, జనావాసాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్ర నేరమని, ఇది డ్రైవర్‌తో పాటు



సమావేశంలో మాట్లాడుతున్న డి ఎం సునీత

ప్రయాణికుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగం పూర్తిగా నివారించాలని, అది ఏకాగ్రతను దెబ్బతీసి ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని, సిగ్నల్స్‌ను గౌరవించాలని, అనవసరంగా ఓవర్ టేక్ చేయకూడదని, ముఖ్యంగా ఎడమ వైపు నుండి ఓవర్ టేకింగ్ చేయరాదని పేర్కొన్నారు. బస్సులను ఎల్లప్పుడూ నిర్ణీత బస్ స్టాప్‌లలోనే ఆపాలని, రోడ్డు మధ్యలో ప్రయాణికులను ఎక్కించడం లేదా దించడం ప్రమాదకరమని సూచించారు. డ్రైవర్లు అలసట లేదా నిద్రగా అనిపించినప్పుడు వెంటనే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో ఆపి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, జీబ్రా క్రాసింగ్ వద్ద వారికి దారి ఇవ్వాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు వృద్ధులు రోడ్డు దాటేటప్పుడు ఓపికగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి డ్రైవర్ సురక్షితంగా ఇంటికి చేరుకోవడం మాత్రమే కాకుండా, తమ ప్రయాణికులను కూడా సురక్షితంగా గమ్యానికి చేర్చడం తమ బాధ్యతగా భావించాలని, "సురక్షిత ప్రయాణం – అందరి లక్ష్యం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సునీత, డ్రైవర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో కరెంట్ అంతరాయం లేకుండా చూడాలి

**నాగర్ కర్నూల్ జిల్లా విద్యుత్ అధికారి కె.వి నరసింహారెడ్డి**

**ఉప్పునుంతల, మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలో విద్యుత్ అంతరాయం లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వేసవి కాలం కావడంతో ఎక్కడ విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యుత్ అధికారి ( ఎస్సీ ఇ)కె.వి నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ఉప్పునుంతల, మొల్గర, దాసర్లపల్లి గ్రామాలను సందర్శించారు. వ్యవసాయ కనెక్షన్ల విద్యుత్ బిల్లు 100 శాతం వసూలు చేయాలని, విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి వారికి విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తే వారు విద్యుత్ అధికారులకు సహకరిస్తారని పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో స్తంభాలు నాటిన వైర్ లేకపోవడంతో కాలనీ లకు విద్యుత్తు సరఫరా అందడం లేదని గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు జిల్లా విద్యుత్ అధికారి ( ఎస్సీ ఇ)కెవి నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లడం తో సత్వరమే స్పందించి స్తంభాలు నాటిన వాటికి వెనువెంటనే వైర్లు లాగాలని సూచించారు. అదేవిధంగా మరో అదనపు ట్రాన్స్ ఫార్మర్ కావాలని సర్పంచ్ కోరడంతో సత్వరమే అందజేస్తామని సూచించారు. మొల్గర గ్రామంలో విద్యుత్ సరఫరా పట్ల ఆరా తీశారు. ఎక్కడైనా అవసరం ఉంటే సత్వరమే వినియోగదారులకు అందించాలని స్థానిక విద్యుత్ అధికారులకు సూచించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల బీసీ కాలనీ తో పాటు గ్రామంలో కలియ తిరిగారు. దాసర్లపల్లి లో విద్యుత్ సరఫరా పట్ల గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వైర్లు కావాలని గ్రామస్తులు కోరారు. విద్యుత్ జిల్లా అధికారి (ఎస్సీ)కె.వి నర్సింహారెడ్డి తో పాటు అచ్చంపేట డివిజన్ విద్యుత్ అధికారులు ఆంజనేయులు, ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప్పునుంతల ఎఇ కొండల్, అమ్రాబాద్ ఏఈ రమేష్, స్థానిక సిబ్బంది నరేందర్, బాలస్వామి, వెంకటేష్, మొల్గర లో శ్రీపురం సుమన్ రెడ్డి, పవన్ రెడ్డి, తదితరులున్నారు.



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్సీ కెవి నరసింహారెడ్డి

## వార్డ్ సభ్యులు ఐక్యంగా ఉండి గ్రామాలు అభివృద్ధి చేసుకోండి

**దేవరకద్ర, మార్చి 24 ప్రభాతవార్త :** గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, వార్డ్ సభ్యులు ఐక్యంగా ఉండి, గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయా గ్రామాల్లో నూతనంగా ఎంపికైన వార్డుసభ్యులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో శివప్రసాద్, మండలపరిషత్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వార్డ్‌సభ్యులు గ్రామాభివృద్ధి పనుల పర్యవేక్షణ, గ్రామసభలో పాల్గొనడం, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యపాత్ర పోషిస్తారని తెలిపారు. శిక్షణద్వారా వార్డ్‌సభ్యులకు బాధ్యతలు అధికారులు, పరిపాలన విధానం, ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్, పారదర్శక పాలనపై అవగాహన కలుగుతుందని తెలిపారు. వార్డు సభ్యులు ఐక్యంగా ఉండి గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని, ఐక్యతతో పనిచేస్తే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, శిక్షణ కార్యక్రమాలను వార్డ్ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివప్రసాద్ సూచించారు. ఐదు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమానికి ప్రతి వార్డ్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీవో శివప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ కీర్తి, ఎంపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు బుచ్చన్న, అశోక్, పవన్, నాగిరెడ్డి, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

## భగత్‌సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

**దామరగిద్ద, మార్చి 24 ప్రభాతవార్త :** విప్లవ వీరులు భగత్ సింగ్ , శివరాం రాజగురు , సుఖీదేవ్ తపర్‌ల 95వ వర్ధంతి సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలో కమ్యూనిస్ట్ పార్టీ అఫ్ ఇండియా (సిపిఎం) ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి, దీపాలతో నివాళులు అర్పించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర కాలనీలో బహిరంగసభ జరిగింది. సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర నాయకులు ఆర్.వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామిరెడ్డి, మద్దూర్ ఏరియా కార్యదర్శి గోపాల్ పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి చేయడానికి ప్రాణత్యాగం చేసిన యువ విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల ఆశయాల సాధన కోసం నేటియువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 1928లో హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ఏర్పాటులో భగత్ సింగ్ కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలో సోషలిస్టు అనే పదాన్ని చేర్చడం కూడా భగత్ సింగ్ ఆలోచనల ప్రభావమేనని పేర్కొన్నారు. అయితే నేటి పాలకులు భగత్ సింగ్ ను మాటల్లో పొగుడుతూ, ఆయన ఆశయాలను అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. దేశాన్ని మత ప్రాతిపదికగా విభజించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, లౌకిక రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను మూఢనమ్మకాలతో మభ్యపెట్టి రాజకీయ లాభాలు పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రపంచ రాజకీయాలపై స్పందిస్తూ, అమెరికా ఆధిపత్య విధానాలను తీవ్రంగా ఖండించారు. డోనాల్డ్ ట్రంప్ విధానాలు ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే భగత్ సింగ్ వారసత్వాన్ని నిజంగా కొనసాగించడం అవుతుందని తెలిపారు. కామ్రేడ్ జోషి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి అంజిలయ్య, మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్, శివకుమార్, కనకప్ప, అరుణ్, ప్రకాష్, అలాగే డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ అఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) నాయకులు హన్మంతు, విజయ్ బాబు, భీంశప్ప, మొగులప్ప, షేర్ ఖాన్, అంజప్ప, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## స్పెషలిస్ట్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- డీఎంహెచ్ఓ డా. కె.రవికుమార్ నాయక్**

**వెల్దండ, మార్చి 24 ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల ఆరోగ్య మిషన్" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషలిస్ట్ వైద్య శిబిరాలను ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.కె.రవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్ తో కలిసి జిల్లా వైద్యాధికారి రవికుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చిన స్త్రీరోగ నిపుణులు, శిశు వైద్యులు, ఎముకల వైద్యులు, కంటి వైద్యులు, దంత వైద్యులు జనరల్ ఫిజీషియన్లు పాల్గొని వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స మందులను అందించారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు వారి గ్రామాల వద్దే అందుబాటులోకి వస్తున్నాయని అలాగే, ప్రపంచ క్షయవ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం రెండో దశలో భాగంగా, 14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ టిబి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని టిబి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, సమయానికి చికిత్స తీసుకుంటే టిబి పూర్తిగా నయం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. భీమా నాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం డా. సమీరా , డా. ప్రమోద్, డా.సాయి తేజ, డా. లత, డా. స్ఫూర్తి, డా. ఖదీర్ స్థానిక వైద్యాధికారి డా.సింధు, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్ పర్యవేక్షణ అధికారులు మురళీకృష్ణ , మనోజ్. కవిత , సుమిత, ప్రమోద్, డిస్ట్రిక్ట్ వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఫార్మసీ ఆఫీసర్ అనిత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, లక్ష్మణ్, గోవర్ధన్, భరత్ గౌడ్, వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

## మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఎంఈఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

**దామరగిద్ద, మార్చి 24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామ కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని కార్మికులను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు రుచికరమైన మరియు పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనంతమ్మ, ఉపసర్పంచ్ రవి, జీపీవో రాములు, హెడ్‌మాస్టర్ హుస్సేనప్ప, ఉపాధ్యాయులు ప్రవీణ్, శారద, అలీ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంసానిపల్లి శ్రీరామ గట్టుపై సీతా రాముల కళ్యాణం

**ఉప్పునుంతల, మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని కంసానిపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీరామ గట్టు పై శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అత్యధికంగా భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీరామ గట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శ



నివాళులర్పిస్తున్నరాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**వెల్దండ, మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన గొల్ల రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చలకుర శ్రీనివాస్, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ భీమయ్య గౌడ్, నరసింహ ముదిరాజు మైసయ్య, లాలయ్య, కొండల్ ,రమేష్, అలీల్ తోపాటు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనుల నిధుల మంజూరుకై సీఎం సోదరుడికి వినతి



సీఎం సోదరుని కలిసిన మండల నాయకులు

**వెల్దండ, మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలో పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి తగుళ్ల కొండల్ యాదవ్, లింగారెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ మహమ్మద్ అన్వర్ పాష రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతి రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రాథమిక వసతుల కొరత తీవ్రంగా ఉందని డ్రైనేజీ సీసీ రోడ్ల నిర్మాణం, స్మశాన వాటిక, పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ గోడ ఎంజి తండా నుండి పోతేపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

